క్లుప్తంగా

సంపద కేంద్రం వినియోగానికి చర్యలు



శావల్యాపురం: కనమర్లపూడి గ్రామంలో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రం వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాలని ఈఓపీఆర్డీ పి.సుగుణ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ సంపద కేంద్రం అలంకారప్రాయంగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని వివరించారు. మాజీ సర్పంచ్ తన్నీరు అంకారావు, పంచాయతీ కార్యదర్శి కానుగంటి మహేంద్ర గ్రామస్తులు పాల్గొన్నారు.

గుంటుపాలెం సర్పంచ్‌ను నియమించాలి

శావల్యాపురం: గుంటుపాలెం గ్రామానికి సర్పంచ్ లేకపోవటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచ్ పచ్చవ తేజస్విని వ్యక్తిగత పనుల నిమిత్తం సెలవుపై వెళ్లారు. ఈక్రమంలో ఉప సర్పంచ్ నారు సుబ్బారెడ్డి బాధ్యతలు స్వీకరించి ఐదు నెలలు పనిచేశారు. ఆయన కూడా వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా చేసి సంబంధిత అధికారులకు లిఖిత పూర్వకంగా తెలిపారు. ఈవిషయం గురించి నరసరావుపేట డివిజన్ పంచాయతీ అధికారి లక్ష్మణరావును వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శి, ఈఓపీఆర్డీ పంచాయతీ స్థాయి నుంచి సర్పంచ్ నియామకంపై ఎటువంటి ప్రతిపాదనలు అందలేదని వివరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

గుండె ఆపరేషన్‌కు ఆర్థిక సాయం



వినుకొండ(నూజెండ్ల): దర్శికి చెందిన ఐనకోల ఇజ్రాయేలు గుండె ఆపరేషన్ నిమిత్తం రోటరీ క్లబ్ మిత్రుల సహకారంతో రూ.20వేలు ఆర్థిక సహాయం చేశారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వినుకొండలోని రోటరీ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి ఆటోమొబైల్ షాపులో నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు గుమ్మ శ్రీకాంత్‌రెడ్డి, సెక్రటరీ ఏరువా వెంటనారాయణ, కోశాధికారి షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

డైరెక్టర్స్ అండ్ డ్యాన్స్ మాస్టర్స్ సమావేశం



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ నియోజకవర్గ డైరెక్టర్స్ అండ్ డ్యాన్స్ మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏబీఎం కాంపౌండ్‌లోని కళాకారుల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు నేలపట్ల హరిబాబు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రభుత్వం ద్వారా ఎలాంటి సంక్షేమ పథకాలైనా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ద్వారా చర్చించి కళాకారులకు సంక్షేమ నిధి ఏర్పాటు చేసి అందేలా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్స్ పి.ఐ.కుమార్, ఎ.సాల్మన్‌రాజు, కె.నాగేశ్వరరావు, కె.పిచ్చయ్య, పి.కోటి, ఎం.కోటి, డి.స్కైలాబ్, బి.వెంకట్రావు, ఒ.ఇశ్రాయేలు తదితరులు పాల్గొన్నారు.

10న డీవర్మింగ్ డే



శావల్యాపురం: జాతీయ నులి పురుగుల నివారణ దినం (డీవర్మింగ్‌డే) కార్యక్రమం ఈనెల 10న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పేరుమీన సీతారామయ్య చెప్పారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో 15 గ్రామపంచాయతీలు ఉండగా 1 నుంచి 19 ఏళ్లలోపు చిన్నారులు 5,714 మంది పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ వీరిందరికీ ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని వివరించారు. అనంతరం పాఠశాలల వారీగా మాత్రల బాక్సులు అందించారు. కార్యక్రమంలో వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్, సూపర్‌వైజరు అలవలపూడి ఏడుకొండలు, ఫార్మాసిస్ట్ లక్ష్మీనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ సతీష్ ఉన్నారు.

రేపు నందికుంట విఘ్నేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

నాదెండ్ల: గణపవరం-నాదెండ్ల డొంక రోడ్డులో కొలువై ఉన్న నందికుంట విఘ్నేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి గణపతిహోమం, పంచామృతాభిషేకాలు, అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, భారీ అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళల కోలాట ప్రదర్శన జరుగుతుందని వెల్లడించారు.

కొండలరావుపేటలో సమస్యల తిష్ట



పట్టణంలోని 15వ వార్డు కొండలరావుపేటలో అధ్వాన్నంగా ఉన్నరోడ్లు, ఇళ్లముందు సైడు డ్రైయిన్‌పై ఉన్న అరుగులు

రోడ్లు, డ్రెయిన్లు అధ్వానం
- పగిలిపోయిన సీసీరోడ్లు
- ఇళ్లముందు అరుగుల నిర్మాణంతో కుచించుకుపోయిన రోడ్లు
- వాహనాలు వచ్చి వెనుతిరగాలంటే కష్టమే
- కొత్త రోడ్లు వేసి నిర్మించి ఆక్రమణలు తొలగించాలంటున్న స్థానికులు

నరసరావుపేట: తాము అధికారంలోకి వచ్చిన ఆర్నెలల్లో రోడ్లను అద్దాలుగా మారుస్తామంటూ ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి నేతలు ఆ విషయాన్ని మర్చిపోయారు. పట్టణ నడిబొడ్డున ఉన్న 15వ వార్డు కొండలరావుపేటలో అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారైనా పట్టించుకునే వారు కరువయ్యారు. ఈ రోడ్లపై తామెలా రాకపోకలు సాగించాలంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పురపాలక సంఘ పరిధిలో 34 వార్డులు ఉండగా వాటిలో సుమారుగా 1.60 లక్షల జనాభా నివాసం ఉంటున్నారు. సీసీ రోడ్లు 140 కిలోమీటర్లు, బీటీ రోడ్లు 1.5 కిలోమీటర్లు, మట్టిరోడ్లు 2.5 కిలోమీటర్లు, ఇతర రోడ్లు 9 కిలోమీటర్ల వరకు ఉన్నాయి. కొండలరావు పేట పురపాలక సంఘ పరిధిలోనే పురాతన ప్రాంతాల్లో ఒకటి. వాణిజ్య ప్రాంతంలో ఉంటూ ఒకవైపు లాల్‌బహదూర్ కూరగాయల మార్కెట్, మూడు దిక్కులా రైల్వేలైను, పాత పోలీసుస్టేషన్ రోడ్డు, వరవకట్ట ప్రాంతాలు ఉన్నాయి. ఇక్కడ అన్ని వర్గాల ప్రజలు నివాసం ఉంటున్నారు. కొంతకాలంగా ఈ ప్రాంతం మౌలిక వసతుల కల్పనలో నిరాదరణకు గురవుతూ వస్తోంది. నివాసాల మధ్య 20 అడుగుల రోడ్లు మాత్రమే ఉన్నాయి. అవికూడా ఇళ్లముందు డ్రెయిన్లపై నిర్మించిన అరుగులు, మెట్లతో మూసుకుపోయాయి. మున్సిపల్ ఎన్నికల్లో స్థానికులు టీడీపీ అభ్యర్థిని కౌన్సిలర్‌గా ఎన్నుకున్నారు. అయినా ఈ ప్రాంతం మాత్రం అభివృద్ధికి నోచుకోట్లేదు. ఎప్పుడో వేసిన సీసీ రోడ్లు పగిలిపోయి పచ్చగడ్డి పెరిగింది. మున్సిపల్ అధికారులు తమవైపు కన్నెత్తి చూడట్లేదని స్థానికులు వాపోతున్నారు. డ్రెయిన్లు 15రోజులకు ఒకసారి వచ్చి బాగుచేస్తున్నారని వెల్లడిస్తున్నారు. పట్టణ నడిబొడ్డున ఉన్న తమ ప్రాంతంలో రాత్రి సమయంలో ఇళ్లకు చేరుకోవాలంటే ఇబ్బంది పడాల్సివస్తుందని, పాలుపోసే వారు తమ ప్రాంతానికి వచ్చేందుకు సంశయిస్తున్నారని వాపోతున్నారు. ఇటీవలనే పురపాలకసంఘం పట్టణంలో పలురోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు రూ.21లక్షల వ్యయం చేసింది. అయినప్పటికీ ఈ ప్రాంతంలో రోడ్లకు మాత్రం మోక్షం కలగలేదు. వెంటనే నూతన రోడ్లు వేయాలని, డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగించాలని కోరుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావును వివరణ కోరగా రోడ్లపై ఏర్పాటుచేసిన ఆక్రమణలను తొలగించి నూతన సీసీరోడ్లు వేయించేందుకు కృషిచేస్తామన్నారు. ప్రతిరోజూ మున్సిపల్ సిబ్బందిచే డ్రెయిన్లు క్లీన్ చేయిస్తామని చెప్పారు.

ప్రజలను దగా చేసిన కూటమి

మాజీ ఎమ్మెల్యే బొల్లా ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బొల్లా

వినుకొండ(నూజెండ్ల): కూటమి నేతలు ఎన్నికల ముందు ప్రజలకు అలవి కాని హామీలు ఇచ్చి ఇప్పుడు దగా చేస్తున్నారని వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో బొల్లా మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికలకు ముందు బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ అంటూ గారడీ చేశారని విమర్శించారు. హామీలు అమలు చేయలేక ప్రశ్నించే సోషల్ మీడియాపై కేసులు పెట్టి వేధించడమే పనిగా పెట్టుకున్నారని, చంద్రబాబు బాటలోనే ఎమ్మెల్యేలు పాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. వారికి ఓట్లు వేయని వారి పింఛన్లు తొలగించడం దారుణమన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో వినుకొండ అన్ని విధాలా అభివృద్ధి చెందిందని, ఇప్పుడు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపు చర్యలకు దిగడం తప్ప వినుకొండకు చేసిందేమీ లేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నడిరోడ్డుపై రషీద్‌హత్య జరిగిందని, అయితే సంబంధం లేని కేసుల్లో రషీద్ అన్న పేరు చేర్చి కేసులు వాపసు తీసుకోవాలని వేధిస్తున్నారని బొల్లా మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలనూ కేసుల్లో ఇరికించి జైల్లో పెట్టారని, పిట్టంబండ గ్రామానికి చెందిన వైసీపీ నాయకులను ప్రతిరోజూ పోలీస్టేషనుకు పిలిచి సాయంత్రం వరకు ఉంచి కేసు నమోదు చేయకుండా నెలల తరబడి వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యకర్తలకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ హయాంలో వినుకొండ తాగునీటిచెరువును అభివృద్ధి చేశామని, ఘాట్‌రోడ్డు పనులు చేపట్టామని, కొండపై ఒక్క రాయి కూడా వేయని టీడీపీ నేతలు రోడ్డుపై విమర్శలు చేయడం సిగ్గుచేటని బొల్లా విమర్శించారు. ఆలయ అభివృద్ధి కోసం రూ. 3 కోట్లు చందాలు వసూలు చేసి ఇచ్చామని, తాను రూ. 90 లక్షల చందా ఇచ్చానని బొల్లా వివరించారు.

వినుకొండలో రెచ్చిపోతున్న మాఫియా

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వినుకొండలో సామాన్యుల భూములకు రక్షణలేకుండా పోయిందని బొల్లా ఆందోళన వ్యక్తం చేశారు. భూములను టీడీపీ నేతలు కబ్జా చేస్తున్నారన్నారు. ఏబీఎం క్రైస్తవ ఆస్తులకూ రక్షణ లేకుండా పోయిందని పేర్కొన్నారు.

వ్యాపారవర్గాల అభ్యున్నతికి కృషి



చాంబర్ ఆఫ్ కామర్స్ కొత్త కార్యవర్గంతో వ్యాపార సంఘాల ప్రతినిధులు

చిలకలూరిపేట: వ్యాపార వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తానని చిలకలూరిపేట చాంబర్ ఆఫ్ కామర్స్ కొత్త అధ్యక్షుడు కొత్తమాసు శ్రీనివాసరావు చెప్పారు. చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గాన్ని పట్టణంలోని వాసవీ జ్ఞానమందిరంలో గురువారం రాత్రి ఎన్నుకున్నారు. అధ్యక్షుడితోపాటు ప్రధాన కార్యదర్శిగా ఆరెకట్ల కోటేశ్వరరావు, కోశాధికారిగా కె రాధాకృష్ణుడు, అదనపు ప్రధాన కార్యదర్శిగా కొంజేటి వెంకటరత్నంలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యాపార వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి తమ కార్యవర్గం శక్తి వంచన లేకుండా కృషి చేస్తోందని వెల్లడించారు. కార్యక్రమంలో వివిధ వ్యాపార సంఘాలకు చెందిన ప్రతినిధులు వెలంపల్లి రవిశంకర్, గుర్రం సాంబశివరావు, చేవూరి కృష్ణమూర్తి, కనమర్లపూడి రమేష్, కొత్త కోటేశ్వరరావు, తవ్వా నాగమల్లేశ్వరరావు, ఎం.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రక్షణ చట్టం అమలు చేయాలి

రొంపిచర్ల : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు రక్షణ చట్టం అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం మండల కేంద్రమైన రొంపిచర్లలో బీసీ సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సరికొండ తిమ్మరాజు మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్ల శాతం పెంచాలని అన్నారు. బీసీలలో అట్టడుగున కులాలకు రక్షణ నిమిత్తం తప్పనిసరిగా బీసీ రక్షణ చట్టం అమలు చేయాలన్నారు. 50 సంవత్సరాలు దాటిన బీసీలకు పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మండల నాయకులు కోనేటి నరసింహారావు, సరికొండ పార్థసారథి రాజు, ముక్కడాల శ్రీనివాసరావు, గుమ్మడిదల సాంబశివరావు, చక్రవరం వెంకటేశ్వరరాజు, షేక్ సైదా, కోటి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నాదెండ్ల: చిరుమామిళ్ల నడికట్టు రామిరెడ్డి ఎస్టీ కాలనీలోని శివాలయంలో నాదెండ్ల వెళ్ళే బైపాస్‌రోడ్డు వద్ద ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆలయాలను నిర్మించిన దాత నడికట్టు రామిరెడ్డి కుటుంబ సభ్యులు హైదరాబాద్ నుంచి వచ్చి గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదరికంలో ఉన్న ఎస్టీ కుటుంబాలకు తన సొంత డబ్బుతో స్థలం కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించి ఇచ్చినట్టు పేర్కొన్నారు. గ్రామంలో రామిరెడ్డి చేసిన అభివృద్ధి పనులతో ఎంతో మందికి మేలు జరిగిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు ఉదారంగా తోడ్పాటునందిస్తామని పేర్కొన్నారు.

వైద్యవృత్తికి నర్సింగ్ వెన్నుముక



డాక్టర్ చెన్నారెడ్డిని సత్కరిస్తున్న నర్సింగ్ కళాశాల సిబ్బంది

నరసరావుపేట ఈస్ట్: వైద్యవృత్తికి నర్సింగ్ వెన్నుముక వంటిదని డాక్టర్ డి.చెన్నారెడ్డి తెలిపారు. పీఎన్‌సీ అండ్ కేఆర్ నర్సింగ్ కళాశాలలో సోమవారం విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ చెన్నారెడ్డి మాట్లాడుతూ, రోగుల పట్ల నర్సింగ్ సిబ్బంది బాధ్యతతో వ్యవహరిస్తారని తెలిపారు. నర్సింగ్ విద్యకు ఉజ్వల భవిష్యత్ ఉందని, ప్రపంచ వ్యాప్తంగా అవకాశాలు లభిస్తాయని వివరించారు. నర్సింగ్ విద్యను నోబెల్ ప్రొఫెషన్‌గా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ పి.శ్రీనివాసప్రసాదు, ప్రిన్సిపల్ డి.గోపీనాథ్, వైస్ ప్రిన్సిపల్ బి.సుజీకల్పన పాల్గొన్నారు. అనంతరం చెన్నారెడ్డిని సత్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పార్క్ చేసిన కారు చోరీ



నరసరావుపేటటౌన్: ఇంటి ఎదుట నిలిపి ఉన్న కారును గుర్తు తెలియని దుండగుడు అపహరించుకు వెళ్లిన ఘటన శుక్రవారం పట్టణంలో వెలుగు చూసింది. రామిరెడ్డిపేట కాశీరత్నం పాఠశాల ఎదుట ఎన్.హరీష్‌బాబు నివసిస్తుంటాడు. రోజూ మాదిరిగానే ఏపీ 39 ఎంటీ 9032 నంబర్ గల తన కారును గురువారం రాత్రి ఇంటి ఎదుట పార్క్ చేసి నిద్రించాడు. ఉదయం లేచి చూసేసరికి కారు కనిపించలేదు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సమీపంలోని సీసీ ఫుటేజ్ పరిశీలించగా అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగుడు కారు తీసుకొని వెళ్తున్నట్లు నమోదైంది. నిందితుడి ఆచూకి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

పనుల్లో నాణ్యతా లోపాలు లేకుండా చూడాలి

నాదెండ్ల: అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపాలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. శుక్రవారం ఆయన చిలకలూరిపేట-నరసరావుపేట ప్రధాన రహదారి నుంచి మైనంపాడు వెళ్ళే రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. రూ.60 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రోడ్డు పనులను పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. సూచనలు చేశారు. నరసరావుపేట ప్రధాన రహదారి నుంచి కేంద్రీయ విద్యాలయం వరకూ రూ.40 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులనూ ఆయన పరిశీలించారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, జనసేన ఇన్‌చార్జి తోట రాజారమేష్, నాయకులు వజ్జా సింగయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం



నరసరావుపేట: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్.లక్ష్మణరావు శుక్రవారం స్థానిక ప్రైవేటు విద్యాలయాల్లో ప్రచారం నిర్వహించారు. అనంతరం పల్నాడురోడ్డులోని పాత ప్రభుత్వ హాస్పిటల్ ఎదురుగా ఉన్న ఓ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. పీడీఎఫ్ అభ్యర్థుల విజయం కోసం అన్ని ప్రజా సంఘాలు ఏకతాటిపైకి రావాలని కోరారు. సమావేశంలో నాయకులు గద్దె చలమయ్య, ముజఫర్ అహ్మద్, కట్టా కోటేశ్వరరావు, శివకుమారి, ఆంజనేయనాయక్, సిలార్ మసూద్ పాల్గొన్నారు.

మిరప పొలాల పరిశీలన



గరికపాడులో నకిలీ విత్తనాలతో సాగుచేసిన మిరప పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రజని

బొల్లాపల్లి : నకిలీ విత్తనాలతో సాగుచేసిన మిరప పొలాలను లాంఫాం సీనియర్ శాస్త్రవేత్త ఎ.రజని శుక్రవారం పరిశీలించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు నకిలీ మిరప విత్తనాలతో పంట సాగు చేపట్టి నష్టపోయామని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు స్థానిక ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులు పరిశీలించి లాంఫాం సైంటిస్ట్‌ల పరిశీలన కోసం సిఫార్సు చేశారు. ఈ మేరకు లాంఫాం సీనియర్ సైంటిస్ట్ రజని, జిల్లా ఉద్యాన శాఖ అధికారి(డీహెచ్‌ఓ) సీహెచ్.రమణారెడ్డి గరికపాడు, రేమిడిచర్ల గ్రామాల్లో మిరప పొలాలను సందర్శించారు. నకిలీ విత్తనాల గుర్తింపుతో పాటు నమూనాలను సేకరించారు. పరిశీలన అనంతరం సమగ్ర నివేదికను జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి అందజేస్తామని తెలిపారు. అనంతరం రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో వినుకొండ ఏడీఏ బి.రవిబాబు, ఉద్యాన శాఖ అధికారి షేక్ నబీ రసూల్, వ్యవసాయ అధికారి ఎ.అంకారావు, వ్యవసాయ, ఉద్యాన శాఖల సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి

బొల్లాపల్లి : నష్టపోయిన మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మూగచింతలపాలెం, గండిగనుమల తదితర గ్రామాల్లో పీడీఎం ఆధ్వర్యంలో శుక్రవారం మిరప పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రధానంగా మిర్చి పంటను సాగు చేశారని, ఎకరానికి రూ.లక్షన్నర పెట్టుబడి పెట్టి కుటుంబం మొత్తం చాకిరీ చేసినా గిట్టుబాటు ధర లేక రైతుల పరిస్థితి ముందు నొయ్యి, వెనుక గొయ్యిలా తయారైందని పేర్కొన్నారు. ప్రభుత్వం స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎం జిల్లా కార్యదర్శి జి. రామకృష్ణ, ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.కోటానాయక్, పీడీఎం జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు స్వచ్ఛత, అభివృద్ధిపై శిక్షణ



మాట్లాడుతున్న అసిస్ట్ సంస్థ డైరెక్టర్ జాస్తి రంగారావు

యడ్లపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛత కార్యక్రమాలతోపాటు సమగ్ర అభివృద్ధి ప్రణాళికల అమలు ప్రక్రియను పరిరక్షించడమే బంగారు భవిష్యత్తు కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ డాక్టర్ జాస్తి రంగారావు పేర్కొన్నారు. లింగారావుపాలెం జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రంగారావు మాట్లాడుతూ ఐటీసీ, అసిస్ట్ సంస్థలు సంయుక్తంగా మండలంలోని లింగారావుపాలెం జెడ్పీ హైస్కూల్‌ను మోడల్ స్కూల్‌గా ఎంపిక చేశామన్నారు. మిగిలిన స్కూల్స్ అన్నింటినీ ఇదే తరహాలో మార్చడమే తమ సంస్థ లక్ష్యం అన్నారు. ఐటీసీ సహకారంతో అసిస్ట్ ఆధ్వర్యాన అన్ని పాఠశాలల్లోనూ స్వచ్ఛత మౌలిక వసతుల కల్పన, వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయా పాఠశాలల ప్రస్తుత స్థితిగతులు, భవిష్యత్తులో స్వచ్ఛత నిర్వహణ, బాలల మంత్రి మండలి ఏర్పాటు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. హైస్కూల్ హెచ్‌ఎం కేవీ రామిరెడ్డి అధ్యక్షత వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో అసిస్ట్ డెప్యూటీ డైరెక్టర్ పావులూరి రవిబాబు, ఎంఈవో ఎంవీ నాగరత్నం, కో-ఆర్డినేటర్లు డేవిడ్, వెంకయ్య, కార్యకర్తలు, హెచ్‌ఎంలు హాజరయ్యారు.

ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యం నిబంధనలు పాటించాలి

శావల్యాపురం: ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలు తప్పకుండా పాటించాలని ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు చెప్పారు. శుక్రవారం మండల వనరుల కేంద్రంలో ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రైవేటు స్కూల్స్‌లోని విద్యార్థుల భద్రతపై యాజమాన్యం జాగ్రత్తలు పాటించాలని, ఆర్టీఓ అనుమతులు ఉండాలని, అలాగే అనుభవం కలిగి ఉన్న డ్రైవర్లు వ్యసనాలు లేనివారు వాహనాలు నడపాలన్నారు. పోక్సో చట్టంపై విద్యార్థులు, ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచటంతోపాటు మరుగుదొడ్లు టాయిలెట్స్ శుభ్రంగా ఉండేలా యజమాన్యం బాధ్యత వహించాలన్నారు. నిబంధలనలు అతిక్రమిస్తే అటువంటి స్కూల్స్ లైసెన్సు రద్దయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంఈవో-2 పుసులూరి లలితా కుమారి పాల్గొన్నారు.

చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్‌కు జాతీయ అవార్డు



చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్

వినుకొండ(నూజెండ్ల): వినుకొండకు చెందిన చిత్రకారుడు డాక్టర్ వజ్రగిరి జెస్టిస్‌ను మరో జాతీయ అవార్డు వరించింది. ఈనెల 1న క్రియేటివ్ ఆర్ట్ అకాడమీ గుంటూరు వారు నిర్వహించిన జాతీయస్థాయి చిత్రకళా పోటీలలో జెస్టిస్ చిత్రించిన ఉషోదయం చిత్రానికి ఈ అవార్డు లభించింది. ఇప్పటి వరకు ఆయన జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 57 అవార్డులు సాధించారు. ఇది 58వ అవార్డు. ఆరో ఆర్ట్ లెజెండ్ అవార్డు కూడా అని, ఈ నెల 16న గుంటూరులో జరగబోయే కార్యక్రమంలో పురస్కారం అందుకోనున్నట్లు జెస్టిస్ తెలిపారు.

సాయిసాధన చిట్స్ వ్యవహారంలో ఉన్నతస్థాయి విచారణ చేపట్టాలి

నరసరావుపేట రూరల్: సాయిసాధన చిట్‌ఫండ్ పేరుతో పెద్ద ఎత్తున ప్రజాధనాన్ని దోచుకున్న కేసులో వ్యాపార భాగస్వాములు, డాక్యుమెంట్ రైటర్ ఆస్తులపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో పీడీఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, సీనియర్ నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి చికినం చిన్నా, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు. చిట్‌ఫండ్ నిర్వాహకుడు పుల్లారావుతోపాటు వ్యాపార భాగస్వామి గుండా సాంబశివరావు వీరికి సహకరించిన స్టాంప్ రైటర్ ఆస్తులపై పూర్తి దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. వీరి ఆస్తులను స్వాధీనం చేసుకొని బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

క్రీడలపై ఆసక్తి అవసరం



క్రీడాపోటీల్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ బాలకృష్ణ

యడ్లపాడు: క్రీడలు ఆడేందుకు వయోపరిమితి అక్కర్లేదని.. ఆసక్తి, ఉత్సాహం ఉంటే సరిపోతుందని ఎస్‌ఐ వి.బాలకృష్ణ చెప్పారు. బోయపాలెం అనంతలక్ష్మి నూలు మిల్లులో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను శుక్రవారం ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎస్‌ఐ మాట్లాడుతూ కార్మికులు వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడల్లో పాల్గొని మానసిక ఉల్లాసాన్ని, శారీరక ధారుఢ్యాన్ని పెంచుకోవాలన్నారు. క్రీడా పోటీలతో కార్మికుల్ని ప్రోత్సహిస్తున్న మిల్లు యాజమాన్ని అభినందించారు. మిల్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సామినేని ఫణికుమార్ మాట్లాడుతూ మిల్లు అభివృద్ధితోపాటు కార్మికుల శ్రేయస్సును కూడా యాజమాన్యం నిత్యం పర్యవేక్షిస్తుందన్నారు. క్రీడాపోటీలు, ఉచిత వైద్యశిబిరాల నిర్వహణ ఆనవాయితీగా వస్తోందన్నారు. ఎస్‌ఐను ఈడీ సామినేని ఫణికుమార్ సత్కరించారు. కార్యక్రమంలో మిల్లు డైరెక్టర్ బొల్లినేని ప్రసాద్, మేనేజర్ ఇక్కుర్తి వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

నరసరావుపేట: రోడ్డు ప్రమాదాల నివారణలో రాష్ట్ర ప్రభుత్వ అధికారుల వైఫల్యం స్పష్టంగా కన్పిస్తోందని మాలమహానాడు జిల్లా అధ్యక్షులు డాక్టర్ గోదా జాన్‌పాల్ విమర్శించారు. శుక్రవారం పట్టణం నుంచి కూలీలతో వెళుతున్న ఆటో కనపర్తి వద్ద ప్రమాదానికి గురికాగా, అందులోని 18 మంది గాయపడ్డారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారిని జాన్‌పాల్, నాయకులు పరామర్శించారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గామాల్లో పని కల్పించకపోవడం వల్ల కూలీలు పొరుగూళ్లు వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు నియోజకవర్గ వర్కింగ్ అధ్యక్షుడు వుస్తేల జయరావు, ప్రకాష్ పాల్గొన్నారు.

చికిత్స కేంద్రంలో న్యాయమూర్తి సందర్శన



వైద్యులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి సత్యశ్రీ

నరసరావుపేటటౌన్: జిల్లా సత్వర చికిత్స కేంద్రాన్ని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్.సత్యశ్రీ శుక్రవారం సందర్శించారు. అక్కడ అందుతున్న సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. 19 ఏళ్లలోపు పిల్లలకు అన్ని రకాల పుట్టుక లోపాలు, వ్యాధులు, వైకల్యాలతో కూడిన చికిత్సలు జరుగుతున్నట్లు వైద్యులు న్యాయమూర్తి దృష్టికి తీసుకొచ్చారు. అలాగే ఈ సెంటర్‌కు వచ్చే వారికి ఉచిత బస్సు సౌకర్యం ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.